క్లుప్తంగా

వైభవంగా పౌర్ణమి ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి: పట్టణ రైల్వేస్టేషన్ రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వైభవంగా వైశాఖ మాస పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీవారికి స్నపన తిరుమంజనం మంగళవారం శోభాయమానంగా జరిగింది. విశేషంగా 51 కేజీల మల్లెలతో మూలమూర్తులకు పుష్పాభిషేకం, మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ శ్యాము ఆచార్య రామానుజ స్వామి గరుడాళ్వార్ మండపంలో వేంచేసి ఉన్న గరుడాళ్వార్ మూర్తికి పూజలు నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు అత్యంత ఇష్టమైన, శక్తివంతమైన గరుడ వాహనంపై పుర వీధులలో దర్శనమిస్తూ భక్తులకు అభయప్రదానం చేశారు. ఏకాంత సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గరుడ ముద్ద, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు, శ్రీవారి సేవా సమాజం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు డయల్ యువర్ డీఎం

సత్తెనపల్లి: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి, సలహాలు, సూచనలు అందించేందుకు ఈ నెల 14న డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ సత్తెనపల్లి డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 11.00 గంటల నుంచి 12.00 వరకు డయల్ యువర్ డీఎం జరుగుతుందన్నారు. ప్రయాణికుల సమస్యలు, మెరుగైన సేవలకు 9959225429 నెంబరును సంప్రదించాలన్నారు.

ఆర్ఐగా బాధ్యతలు చేపట్టిన వంశీకృష్ణ



పెదకూరపాడు: మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా వంశీకృష్ణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో రాజుపాలెం సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన ఆయన పదోన్నతిపై పెదకూరపాడు ఆర్ఐగా బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూ పరమైన సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు. అనంతరం వీఆర్వోలు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

కనుల వండువగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణం



నకరికల్లు: స్థానిక కొండపై గల ఆదిలక్ష్మి చెంచు లక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణ వేడుక మంగళవారం కనుల వండువగా జరిపించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్వామి వారి కల్యాణం కమనీయంగా జరిగింది. కల్యాణం తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పలువురు దంపతులు కల్యాణ వేడుకలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు కొడవటికంటి మధుసూధనాచార్యులు, పాండురంగాచార్యులు, శ్రీకాంత్‌చార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. ముందుగా స్వామివారికి 108 కలశములతో అభిషేకాలు చేశారు. పంచామృతస్నపన గావించి ప్రత్యేకంగా అలంకరించారు. పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

చికెన్ షాపుల ఆకస్మిక తనిఖీ



దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో తూనికలు కొలతల శాఖ సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ షేక్ సైదా మంగళవారం చికెన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని అల్లా చికెన్ సెంటర్‌లో తూనికల్లో మోసగిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. 10 కిలోలకు ఒక కిలో చొప్పున తూనికల్లో ఎల్ మోడ్ పద్ధతిలో మోసగిస్తున్నట్టు గుర్తించటం జరిగిందన్నారు. దీంతో దుకాణదారుడు షేక్ అల్లాబక్షుపై కేసు నమోదు చేసి మూడు కాటాలను స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. తూనికల అధికారులు వచ్చారన్న సమాచారం తెలుసుకున్న మిగతా చికెన్ దుకాణాలన్నీ మూత వేసినట్లు తెలిపారు. ఎవరైనా తూనికల్లో మోసాలకు గురైతే తూనికలు కొలుతల శాఖ సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్‌కు 9885127512 నంబరులో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

చెరువునిండా నీరు.. అందరికీ అందదు

తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న దొడ్లేరు గ్రామ ప్రజలు

- మూడు ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నా పనిచేసేవి రెండే
- నిత్యం మరమ్మతులకు గురవుతున్న పైపులైన్లు
- గ్రామంలో కొన్ని వీధులకు అసలు పైపులైన్లే వేయలేదు
- తొమ్మిది నెలల తరువాత కొన్ని ప్రాంతాలకే నీటి విడుదల



బావిదగ్గర నీళ్లు తెచ్చుకుంటున్న జనం



దొడ్లేరులో తాగునీటి చెరువు


దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు గ్రామ పంచాయతీ మండలంలో క్రోసూరు తరువాత రెండవ పెద్ద పంచాయతీ. గ్రామంలో నీటి నిర్వహణ సక్రమంగా లేకపోవటంతో గ్రామం మొత్తం నీటి సరఫరా జరగటం లేదు. గ్రామంలో రెండు పెద్ద చెరువులున్నాయి. ఒకటి సాగునీటి చెరువు, ఒకటి తాగునీటి చెరువు. రెండు చెరువుల్లో నాగార్జునసాగర్ నీళ్లతో నీళ్లు పుష్కలంగా ఉంటాయి. చెరువుగట్టు మీద నిర్మించిన పంపుహౌస్ ద్వారా ఫిల్టర్‌బెడ్‌కు, దాని ద్వారా ఓవర్ హెడ్ ట్యాంకులకు నీళ్లు అందించే ఏర్పాటు ఉంది. అందుకు గాను మూడు వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకులున్నాయి. అయినా గత తొమ్మిది నెలలుగా గ్రామంలో నీటి సరఫరా లేని పరిస్థితి. పంచాయతీ ద్వారా నీళ్లు ఎప్పుడూ సక్రమంగా రావటం లేదని, బోర్లు, బావుల దగ్గర నుంచి తెచ్చుకోవాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొమ్మిది నెలల తరువాత పైపులైనులు మరమ్మతులు చేసి నీటి సరఫరా చేసినప్పటికీ కొన్ని ప్రాంతాలకే నీళ్లు అందుతున్న పరిస్థితి.

మూడు ఓవర్ హెడ్ ట్యాంకులు

దొడ్లేరు గ్రామంలో మూడు ఓవర్ హెడ్ ట్యాంకులున్నాయి. వాటిలో ఒకదానికి మెట్లు పూర్తిగా పాడయ్యాయి. అందుకని ట్యాంకు శుభ్రం చేసేందుకు వీలుపడటం లేదు. అదేవిధంగా మరొక ఓవర్ హెడ్ ట్యాంకు పూర్తిగా పాడైంది. కొత్తగా జలజీవన్ మిషన్ పథకంలో బీసీ కాలనీలో నిర్మించిన ఒక ఓవర్ హెడ్‌ట్యాంకు ఉంది. కాగా ప్రస్తుతం పనిచేసేవి రెండు ట్యాంకులే. ప్రభుత్వం, అధికారులు స్పందించి నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని గ్రామంలోని ప్రజలు కోరుతున్నారు.



పనిచేయని ట్యాంకు



జలజీవన్ పథకంలో నిర్మించిన కొత్త ట్యాంకు

నీరు అందేలా చూడాలి

పాత ఓవర్‌హెడ్ ట్యాంకులలో ఒకదానిని శుభ్రం చేసేందుకు మెట్లు పాడవటంతో ఫిల్టర్ బెడ్ ట్యాంకును శుభ్రం చేసి ఆ నీటిని ట్యాంకుకు ఎక్కించటం జరుగుతుంది. దీనికితోడు తరచూ పైపులైన్ల మరమ్మతుల కారణంగా గ్రామంలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుండటంతో గ్రామంలో అన్ని వీధులకు నీళ్లు సరఫరా కాని పరిస్థితి. ప్రభుత్వం గ్రామంలో నీటి సరఫరా నిర్వహణకు సరైన చర్యలు తీసుకుని గ్రామానికి నూటికి నూరుశాతం నీరు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి సరఫరాకు కృషి చేస్తున్నాం



కొన్ని వీధులకు అక్కడి ప్రజలే పైపులైన్లు వేయనీయలేదు. అందుకని ఆ బజార్లకు నీళ్లు రావటం లేదు. మిగతా ప్రాంతాల్లో పైపులు బాగున్న వరకు నీళ్లు వస్తున్నాయి. అయినా అక్కడక్కడ నీటి సరఫరాలో సమస్యలున్నాయి. ట్యాంకు తరచూ బాగు చేయాలంటే మెట్లు అవసరం ఉంది. పంచాయతీరాజ్ శాఖకు నివేదించటం జరిగింది. అదే విధంగా నీళ్లురాని వీధులకు పైపులు బాగు చేసి నీటి సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నాం.

– వెంకయ్య, పంచాయతీ కార్యదర్శి, దొడ్లేరు

నీళ్లు సక్రమంగా రావటం లేదు



పంచాయతీ ద్వారా నీళ్లు ఎప్పుడూ సక్రమంగా రావటం లేదు. ప్రజలందరూ బోర్లు, బావుల దగ్గర తెచ్చుకోవాల్సి వస్తుంది.

– పోసిపోగు మోజెస్ శాస్త్రి, దొడ్లేరు

ఇంటింటికీ కుళాయి అన్నారు..



జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి అన్నారు కానీ నీళ్లు ఎప్పుడూ రావు. ఇటీవల పైపులు బాగు చేసామని చెబుతున్నారు. అయినా అన్ని బజార్లకు నీళ్లు రావటం లేదు.

– గడిపర్తి సంతోష్, దొడ్లేరు

సమస్యలు పరిష్కరించాలని వినతి



క్రోసూరు: మండలంలోని పెరికపాడు ఎస్సీ కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని మంగళవారం ఎంపీడీవో జి.శ్రీనివాస్‌కు కాలనీ వాసులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగటం లేదని, తాగునీటి సమస్య ఉందని, లో వోల్టేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గ్రామ ఎస్సీ నాయకుడు జడ సుబ్బు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేసినట్లు చెప్పారు. అదేవిధంగా గ్రామ సర్పంచ్ ఊడల శ్రీధర్, పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో రాజు, సిద్దెల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి విషయమై ఘర్షణ.. కేసు నమోదు

క్రోసూరు: మండలంలోని హసనాబాద్ గ్రామంలో తల్లిదండ్రులు ఆస్తి రాయాలని కుమారుడు ఒత్తిడి చేస్తూ ఘర్షణ పడటంపై ఇరువురు చేసుకున్న ఫిర్యాదుపై ఎస్ఐ రవిబాబు కేసు నమోదు చేసినట్లు మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన దాచేపల్లి నూర్జహాన్, దాచేపల్లి హుస్సేన్‌లకు నలుగురు కుమారుల్లో హసనాబాద్‌లో నివసిస్తున్న ఒక కుమారుడు దాచేపల్లి దరియా హుస్సేన్, భార్య మస్తాన్‌బీ కలిసి తల్లిదండ్రులు ఆస్తి రాసి ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. ఈ విషయమై తల్లిదండ్రులు, కుమారుడు, కోడలు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ఇరువర్గాల వారికి గాయాలయ్యాయి. ఈ క్రమంలో ఇరువురు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువురి ఫిర్యాదులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కిశోర బాలికల వికాసంపై అవగాహన కలిగి ఉండాలి

సీడీపీవో బి.సరళ

క్రోసూరు: కిశోర బాలికల వికాసం పట్ల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ వర్కర్లు అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో బి.సరళ అన్నారు. మంగళవారం క్రోసూరులోని అంగన్‌వాడీ కేంద్రం ఎనిమిది సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీవో మాట్లాడుతూ బాలికల పట్ల జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలకు 18 సంవత్సరాల లోపు వివాహాలు చేయకూడదన్నారు. అంతేకాక చిన్న వయస్సులో పెళ్లిలు చేస్తే ఆరోగ్యం పాడవుతుందని, బాలికలు గృహ హింసకు గురికావచ్చునన్నారు. శిశుమరణాలు సంభవించటానికి అవకాశాలు ఎక్కువ అని తెలిపారు. సూపర్‌వైజర్ మాధవి మాట్లాడుతూ పోక్సో చట్టం, బాలికల పట్ల లైంగిక వేధింపులపై అవగాహన కల్పించారు. మహిళా పోలీసు సంధ్య బాలికల అక్రమ రవాణా, లైగింక వేధింపుల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

అనంతవరంలో: మండలంలోని దొడ్లేరు సెక్టార్ అనంతవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలికల హక్కులు, పోక్సో చట్టంపై మహిళా కార్యదర్శి ఎం.సుధారాణి, ప్రకాశమ్మ వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు దానమ్మ, సునీత, భూలక్ష్మీ, రిహానా, వెంకట్రావమ్మ, దుర్గాభవాని, షాజీరా, మాణిక్యం బాలికల విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత గురించి తెలిపారు.

పెదకూరపాడులో...

పెదకూరపాడు: మండలంలోని కన్నెగండ్లలో మంగళవారం కిశోరి వికాసం సీజన్ ఫోర్ సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. సూపర్‌వైజర్ మున్ని బాలికలకు హక్కులు, జీవన నైపుణ్యాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

నార్నెపాడులో కిశోరి వికాసం

నార్నెపాడు(ముప్పాళ్ళ): ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్ట్, ముప్పాళ్ళ సెక్టార్ పరిధిలోని నార్నెపాడు గ్రామంలో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.అనంతలక్ష్మి పాల్గొని కిశోర బాలికలకు బాలల హక్కులు, రక్షణ గురించి వివరించారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీఎంఎస్‌కే ఎం.రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు జి.పద్మావతి, ఎం.భూలక్ష్మి, సీహెచ్.మాధురి, టి.తులసి, అంగన్‌వాడీ ఆయాలు, బాలబాలికలు, గర్భిణులు పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడాలి

రాజుపాలెం: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని సీడీపీవో టి.శ్రీలత అన్నారు. మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కులపై సమాజంలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో టి.సంతోషకుమారి, జీఎంఎస్‌కే అశ్విని, ఏఎన్‌ఎం ప్రమీల, సూపర్‌వైజర్‌లు ఆర్.కె.రమాదేవి, బి.ప్రసన్నరాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బెల్లంకొండలో...

బెల్లంకొండ: బాలబాలికలు వారి హక్కులను తెలుసుకోవాలని బెల్లంకొండ సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజ తెలిపారు. మంగళవారం మండలంలోని పాపాయపాలెం గ్రామంలో 'కిశోరి వికాసం' కార్యక్రమంలో భాగంగా బాలల హక్కులు, రక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు బాల బాలికల సార్వత్రిక హక్కుల పరిరక్షణకు చట్టాలు ఉన్నాయని తెలిపారు. కిశోర బాలికల భాగస్వామ్యం, వారి అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నతనం నుంచే ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ జి.సుజాత లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, అనిత, వెంకటరమణ, ఆశా కార్యకర్త పద్మ పాల్గొన్నారు.



క్రోసూరు అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో సరళ



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ అనంతలక్ష్మి



కిశోరి వికాసంపై అవగాహన కల్పిస్తున్న మున్ని



మాట్లాడుతున్న సీడీపీవో టి.శ్రీలత

ఆత్మస్థైర్యం పెంపొందించటానికే కిశోరి వికాసం

సత్తెనపల్లి: కౌమార బాలికల్లో ఆత్మస్థైర్యం పెంపొందించడానికి కిశోరి వికాసం ద్వారా శిక్షణ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పీ ప్రమీల అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సత్తెనపల్లి పరిధిలోని 8వ వార్డు క్రిస్టియన్ పేటలోని ఒకటి, రెండు సెంటర్లలో కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమంలో భాగంగా సెక్షన్–4లో మంగళవారం బాలల హక్కుల రక్షణ, పీవోసీఎస్‌వో చట్టం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ప్రమీల మాట్లాడుతూ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడమే లక్ష్యంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోరి వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడం, ఇతర శాఖలను సమన్వయం చేసుకొని సామాజిక అంశాలతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలు, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.స్వర్ణలత మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి ప్రారంభమైన కిశోరి వికాసం జూన్ 10వ తేదీ వరకు జరుగుతుందన్నారు. 14–18 ఏళ్ల బాలికలు, బడి మానేసిన 11–14 పిల్లలను గుర్తించి వారిని గ్రూపులుగా విభజించి ఆయా అంశాలపై ఆయా ప్రాంతాల్లో బాలికలకు అనువైన సమయంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. దీంతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జీఎంఎస్‌కే ఆషా, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు ఉన్నారు.



పీవోసీఎస్‌వో చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, పక్కన ప్రమీల

జవాన్ మురళీనాయక్ ధైర్యసాహసాలు వెలకట్టలేనివి

అభ్యుదయ విజ్ఞాన సమితి అధ్యక్షుడు మాడా మల్లిఖార్జునరావు

సత్తెనపల్లి: దేశం కోసం పోరాడి వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ మృతి యావత్ దేశానికి దిగ్భ్రాంతి కలిగించిందని, మురళీనాయక్ ధైర్య సాహసాలు వెలకట్ట లేనివని అభ్యుదయ విజ్ఞాన సమితి అధ్యక్షుడు మాడా మల్లికార్జునరావు అన్నారు. భారత్–పాక్ మధ్య యుద్ధంలో మురళీనాయక్ వీర మరణం చెందడంతో పట్టణ గాంధీ చౌక్ వద్ద అభ్యుదయ విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో మంగళవారం వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాడా మల్లికార్జునరావు మాట్లాడుతూ పాకిస్తాన్‌తో యుద్ధంలో జవాన్ మురళీనాయక్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వీర జవాన్ మురళీనాయక్ త్యాగం భరత జాతి ఎప్పటికీ మరువదన్నారు. వీర మరణం పొందిన మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. భారత్ మాతాకు జై.. వందే మాతరం.. జోహార్ వీర జవాన్‌లు.. జోహార్ అని నినదించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మారూరు లింగారెడ్డి, దివ్వెల శ్రీనివాసరావు, నాయకులు కూనాగు వెంకటేశ్వర్లు(బుజ్జి), మద్ది భాస్కర్, షేక్ జాకీర్, మైసూర్ మేస్త్రి, కొత్తూరు విశ్వేశ్వరరావు, ఖాజావలి, పిల్లుట్ల ఆంజనేయులు, నాసరయ్య, దేవతి సుబ్బారావు(మెమంటో), ఆత్మకూరు హరినాథ్, బచ్చు రామసుబ్బారావు, సంకుల తిరుమల రావు, వాకుమళ్ల చెంచిరెడ్డి, మారెళ్ళ స్వామి, చేపూరి వెంకటేశ్వర్లు, తిరుమల పూర్ణ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వీరమరణం పొందిన మురళీనాయక్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాడని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్‌కుమార్ అన్నారు. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణ బార్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం మురళీనాయక్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చిన్నం మణిబాబు, సీనియర్ న్యాయవాదులు దాసరి జ్ఞాన్ రాజ్‌పాల్, పూజల వెంకట కోటయ్య, కళ్ళం వీర భాస్కరరెడ్డి, సయ్యద్ అబ్దుల్ రహీమ్, జొన్నలగడ్డ విజయ్‌కుమార్, దివ్వెల శ్రీనివాసరావులు మాట్లాడారు. వీర మరణం పొందిన మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బుర్రి సైదయ్య, కొల్లా వెంకటేశ్వరరావు, మద్దినేని వెంకట చలపతిరావు, బత్తిన శ్రీనివాసరావు, గుజ్జర్లపూడి సురేష్, తిరుమల, నరిశెటి వేణుగోపాల్, చావా బాబురావు, గంటా వెంకట శివ, అనుమోలు జయరాం తదితరులు పాల్గొన్నారు.



మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లిఖార్జునరావు, నాయకులు



మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

క్రీస్తు బోధనలు ఆచరణీయం

నకరికల్లు: క్రీస్తు బోధనలు ఆచరణీయమని గుంటూరు ఆర్‌సీఎం బిషప్ చిన్నాబత్తుని భాగ్యయ్య అన్నారు. మండలంలోని తురకపాలెం గ్రామంలో చర్చి ఫాదర్‌గా కొండవీటి రాజమోహన్ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అలాగే ఫాతిమామాత చర్చి రజతోత్సవ వేడుకలను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ నాగోతు శౌరయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన 54 మంది మత గురువులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో శాంతి, సౌభ్రాతృత్వం కోసం ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో ఫాదర్‌లు నరిశెట్టి గోవయ్య, నరిశెట్టి కిషోర్, విచారణ ఫాదర్‌లు నరిశెట్టి పౌలురాజు, మల్లవరపు జోసఫ్, సర్పంచ్ నాగోతు దాసయ్య, ఉప సర్పంచ్ నాగోతు బాలాస్వామి, దౌపాటి బాబు, నరిశెట్టి విజయ్, మల్లవరపు ఇన్నయ్య, నాగోతు సుందరరాజు తదితరులు పాల్గొన్నారు.



బిషప్ చిన్నాబత్తుని భాగ్యయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

వేస్ట్ పిక్కర్స్‌కు మెరుగైన జీవన భృతి కల్పించేందుకే 'నమస్తే'

మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్

సత్తెనపల్లి: పురపాలక సంఘ పరిధిలో నిత్యం చెత్త సేకరించి దానిలోని ప్లాస్టిక్‌ను వేరు చేసి వాటిని విక్రయిస్తూ వచ్చే ఆదాయంతో జీవితాన్ని కొనసాగిస్తున్న ప్రజలకు మెరుగైన జీవన భృతి కల్పించేందుకు ప్రభుత్వం నమస్తే కార్యక్రమాన్ని అమలు చేయనుందని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం చెత్త నుంచి ప్లాస్టిక్‌ను వేరు చేసి విక్రయిస్తూ వచ్చిన ఆదాయంతో జీవితాన్ని కొనసాగిస్తున్న ప్రజలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ వేస్ట్ పిక్కర్స్‌ను గుర్తించి వారిని వేస్ట్ పిక్కర్స్ మొబైల్ యాప్‌లో ఆన్‌లైన్ చేయుట జరిగిందన్నారు. పట్టణ పరిధిలో 45 మందిని గుర్తించగా 35 మందికి ఇప్పటికే ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తికాగా మిగిలిన 10 మందికి ఆధార్ కార్డులో చిన్న చిన్న లోపాల కారణంగా ఆగాయన్నారు. వాటిని కూడా వెంటనే ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. వేస్ట్ పిక్కర్స్ నమస్తే రిసోర్స్ పర్సన్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ వేస్ట్ పిక్కర్స్ మొబైల్ యాప్‌లో ఆన్‌లైన్ చేయడం వలన వారికి అనేక ప్రయోజనాలను ప్రభుత్వం కల్పించడం జరుగుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ సారధి, మెప్మా ప్రతినిధి ఖాజావలి, సచివాలయ సిబ్బంది, శానిటరీ మేస్త్రీలు, వేస్ట్ పిక్కర్స్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ ఆనంద్‌కుమార్

పాలకేంద్రం సభ్యుడు కుటుంబానికి ఆర్థిక సహాయం



పెదపాలెం(క్రోసూరు): అచ్చంపేట మండలం పెదపాలెం గ్రామంలోని సంగం డెయిరీ సభ్యుడు బయ్యవరపు గంగయ్య గత నెలలో మృతి చెందటంతో ఆయన డెయిరీలో వెల్ఫేర్ స్కీము సభ్యుడిగా ఉన్నందున మంగళవారం మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసినట్లు రెంటపాళ్ల డెయిరీ మేనేజరు టి.గోపి తెలిపారు. మృతుని నామినీ బి.వెంకటేశ్వర్లుకు రూ.60 వేలు చెక్కును అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నరేష్, కార్యదర్శి చిరుమామిళ్లపల్లి నరసింహారావు, పాలకవర్గ సభ్యులు, అధ్యక్షుడు పాటిబండ్ల వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.